సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



కారులో 84 కిలోల గంజాయి

సీతగుంట పంచాయతీ ముసిడిపుట్టు గ్రామ సమీపంలో కారులో తరలిస్తున్న 84 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. 8లో



నిరుద్యోగులకు టోకరా 8లో

స్వచ్ఛభారత్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో టోపీ వేస్తున్నారు. వీరి ఉచ్చులో పడి మోసపోయిన వారే ఎక్కువగా కనిపిస్తున్నారు.



వైద్య శిబిరానికి విశేష స్పందన

అరకు వారపు సంతలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గిరిజనులు భారీ ఎత్తున తరలివచ్చారు. 8లో

న్యూస్‌రీల్

నేడు జాతీయ లోక్ అదాలత్

సాక్షి,పాడేరు: జాతీయ లోక్‌అదాలత్‌ను శనివారం పాడేరు,అరకులోయ ప్రథమ శ్రేణి జ్యూడీషియల్ కోర్టుల్లో నిర్వహించనున్నారు.ఈ రెండు న్యాయస్థానాల్లో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహణకు ప్రత్యేక న్యాయమూర్తులను నియమించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాడేరు పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్ల అధికారులు ప్రచారం నిర్వహించారు. రాజీ మార్గంలో పెండింగ్ కేసులు పరిష్కారానికి లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని న్యాయవాదులు కూడా ఫిర్యాదుదారులు, కక్షిదారులకు సమాచారం అందించారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహనకు బోర్డులు



అటవీశాఖ సిద్ధం చేసిన అవగాహన బోర్డులు

అనంతగిరి: అటవీశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అనంతగిరి ఘాట్‌రోడ్డులో ప్లాస్టిక్ నిషేధం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ బోర్డులను ఏర్పాటుచేస్తున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు డీఎఫ్‌వో వినోద్‌కుమార్ పర్యవేక్షణలో వీటిని ఏర్పాటుచేస్తున్నామని స్థానిక ఫారెస్ట్ రేంజర్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఘాట్‌రోడ్డు, బొర్రా రోడ్డులోని పర్యాటక ప్రాంతాలను దృష్టిలో పెట్టుకుని, ఈ ప్రాంతాలకు వచ్చే పర్యాటకులకు అవగాహన కల్పించే లక్ష్యంతో వీటిని ఏర్పాటుచేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



అంబేద్కర్ సెంటర్‌లో కురుస్తున్న పొగమంచు

సాక్షి,పాడేరు: మన్యంలో చలిగాలులు నెమ్మదిగా తగ్గుతున్నాయి. ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నాయి. పొగమంచు మాత్రం జిల్లా వ్యాప్తంగా దట్టంగా కురుస్తోంది. ఉదయం 10గంటల వరకు మంచు తీవ్రత ఉంటోంది. శుక్రవారం పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 12డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 13.8 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 14.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు తెలిపారు.

13న బాలల హక్కుల కమిషన్ సభ్యుల పర్యటన

సాక్షి,పాడేరు: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ గొందు సీతారామ్, ఆదిలక్ష్మి త్రిపర్ణలు ఈనెల 13 నుంచి రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటిస్తారని కమిషన్ కార్యదర్శి టి.వి.శ్రీనివాస్ తెలిపారు.13వతేదీ సోమవారం ఉదయం 10 గంటలకు పాడేరు చేరుకుని మోదకొండమ్మతల్లిని దర్శించుకుంటారని తెలిపారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ, పాడేరు ఐటీడీఏ పీవోలను కలుస్తారని ఆయన వివరించారు. జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ,సంక్షేమానికి అమలవుతున్న వివిధ కార్యక్రమాలపై సమీక్షిస్తారని ఆయన పేర్కొన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు పలుశాఖల ఉన్నతాధికారులతో సమావేశాలు నిర్వహించి, సాయంత్రం పాడేరు కేజీబీవీ,గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ బాలసదనాన్ని సందర్శిస్తారని ఆయన వివరించారు. రాత్రి అరకులోయలో బస చేసి మంగళవారం ఉదయాన్నే పలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రి, దిశ పోలీసుస్టేషన్‌ను సందర్శిస్తారని తెలిపారు. అనంతరం పలుశాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

ఆర్టీసీ బస్సులోనే 'శ్రీశైలం' దర్శన టికెట్లు

దాబాగార్డెన్స్ : విశాఖ నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులకు ఆర్టీసీ బస్సుల్లోనే దర్శన టికెట్లను అందజేయనున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు తెలిపారు. శ్రీశైలం సూపర్ లగ్జరీ బస్సులో ముందస్తుగా టికెట్ రిజర్వేషన్‌తో పాటు శ్రీశైలం ప్రత్యేక దర్శనం (శీఘ్ర దర్శనం , అతి శీఘ్రదర్శనం) టికెట్ కూడా పొందవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ కోసం www.apsrtconline.in ద్వారా ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చని, లేదా నేరుగా ద్వారకాబస్‌స్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్ ద్వారా కూడా బుక్‌చేసుకోవచ్చన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అప్పలరాజు పేర్కొన్నారు.

గిరి రైతుకు సిరి ధాన్యాలు

జిల్లాలో చిరుధాన్యాలసాగు గిరి రైతులకు సిరులు కురిపించనున్నాయి. వీటి వినియోగం పెరిగిన నేపథ్యంలో గిరి రైతులకు ప్రధాన ఆదాయ వనరుగా మార్చేందుకు వ్యవసాయశాఖ కసరత్తు మొదలు పెట్టింది. ఈ ఏడాది అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు, మార్కెటింగ్ సౌకర్యం కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తోంది.



రాగులు సాగు

- సాగు విస్తీర్ణం పెంచేందుకు వ్యవసాయశాఖ కసరత్తు
- అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన కేంద్రం
- సాగు విధానాలపై ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు
- మార్కెటింగ్ కల్పించేందుకు క్లస్టర్ల విధానం
- ప్రణాళికల తయారీలో అధికారుల నిమగ్నం

రంపచోడవరం: కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడంతో జిల్లాలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయశాఖ అధికారులు కసరత్తు చేపట్టారు.సాగు విస్తీర్ణం పెంచేందుకు గిరి రైతుల్లో చైతన్యం నింపుతున్నారు.

సాగు విస్తీర్ణం పెంచే దిశగా..

గత ఖరీఫ్‌లో 15,857 హెక్టార్లలో చిరుధాన్యాల సాగు చేపట్టారు. వీటిలో జొన్నలు 30 హెక్టార్లు, రాగులు 13,922 హెక్టార్లు, కొర్రలు 64 హెక్టార్లు, సజ్జలు 88 హెక్టార్లు, సామలు 1,753 హెక్టార్లలో వేశారు. ఇవన్నీ ఆరుతడి పంటలు కావడంతో ప్రస్తుత రబీలో రైతులతో సాగు చేపట్టేందుకు వ్యవసాయశాఖ ప్రణాళికపరంగా చర్యలు చేపట్టింది.

- అంతరించిపోతున్న ఊదలు పంటను తిరిగి సాగులోకి తీసుకువచ్చేందుకు 400 ఎకరాల్లో రైతులతో వేయించేందుకు కార్యాచరణ రూపొందించారు. రైతులకు ఉచితంగా 1500 మినీ కిట్‌లను ఇవ్వనున్నారు. వీటిలో 1200 కిట్లు రాగులు, 300 కిట్లు ఊదలు సరఫరా చేస్తామని అధికారులు తెలిపారు.
- పొలం బడిలో భాగంగా పెదబయలు మండలం గంపరాయి గ్రామంలో వంద హెక్టార్లలో చిరుధాన్యాల సాగును సేంద్రియ విధానంలో చేపట్టాలని నిర్ణయించారు. ఇక్కడ రైతులకు అవసరమైన సహకారం, సలహాలు, సూచనలు అందజేస్తామని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

170 క్లస్టర్ల ఏర్పాటు

జిల్లాలో చిరుధాన్యాలు సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయశాఖ 170 క్లస్టర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. సాగు చేపట్టే రైతులతో మాత్రమే గ్రూపులుగా ఏర్పాటు చేస్తారు. వారు పండించిన చిరుధాన్యాలను వ్యవసాయశాఖ ద్వారా మార్కెటింగ్ చేయడం వీటి ముఖ్య ఉద్దేశం.

- క్లస్టర్ల వారీగా పంటలు, వాటి సాగు వివరాల సమాచారాన్ని కొనుగోలుదారులకు వ్యవసాయశాఖ తెలియజేస్తోంది. క్షేత్రస్థాయిలో రైతులకు చిరుధాన్యాల సాగుపై సూచనలు అందజేస్తుంది. నాణ్యమైన పంటను పండించడం ద్వారా మంచి ధర పొందే అవకాశం ఉంటుంది.
- ఈ ఏడాది అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో చిరుధాన్యాలను ప్రాసెస్ చేసేందుకు నూరుశాతం సబ్సిడీతో యంత్రాలను రైతులకు అందించేందుకు కృషి జరుగుతోంది.
- జిల్లాలో పాడేరు, అరకుతో పాటు రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో మారేడుమిల్లి, వై.రామవరం ఎగువ ప్రాంతాల్లో చిరుధాన్యాలను ఎక్కువగా సాగు చేస్తున్నారు.

సెప్టెంబర్‌లో సదస్సులు..

జనవరి 24 నుంచి 31 రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంలో ఏ నెలల్లో ఏయే కార్యక్రమాలు, ఏ రాష్ట్రం చేపట్టాలో ఇప్పటికే కేంద్రం సూచనలు జారీ చేసింది. దీనిలో భాగంగా జిల్లాలో సెప్టెంబర్ నెలలో చిరుధాన్యాలపై పాఠశాలల్లో అవగాహన సదస్సులు, బ్యానర్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

సాగు విస్తీర్ణం పెంచుతాం

ఈ ఏడాది జిల్లాలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాం. దీనిలో భాగంగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నాం. రైతుల్లో చిరుధాన్యాలకు ఉన్న డిమాండ్‌పై అవగాహన కల్పిస్తున్నాం.

– నందు,
జిల్లా వ్యవసాయ అధికారి, పాడేరు

బాధిత కుటుంబాలకు అన్నివిధాలా సాయం

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: ఆయిల్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో ఐదుగురు గిరిజనులు మృతిచెందడం బాధిస్తోందని, ఆయా కుటుంబాలకు ప్రభుత్వపరంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నివిధాలా సాయం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తెలిపారు.శుక్రవారం ఆమె కాకినాడ,పాడేరులోని జిల్లా అధికారులతో ఫోన్లో మాట్లాడారు. అనంతరం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ గిరిజనుల మరణాలపై సీఎం సకాలంలో స్పందించారని,పెద్ద మొత్తంలో ప్రభుత్వ సాయం ప్రకటించడంతో పాటు,బాధిత కుటుంబాల జీవనోపాధికి చర్యలు తీసుకుంటున్నారని ఆమె తెలిపారు. తక్షణ సాయం కూడా బాధిత కుటుంబాలకు పంపిణీ చేసినట్టు ఆమె పేర్కొన్నారు.

అండగా ప్రభుత్వం : అరకు ఎమ్మెల్యే పాల్గుణ

కాకినాడ జిల్లాలోని ఆయిల్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఐదుగురు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. పోస్టుమార్టంతోపాటు మృతదేహాలను స్వగ్రామాలకు తరలించేలా ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడుతూనే ఉన్నట్టు చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల మరణాలపై దిగ్భ్రాంతి చెందారని, ప్రభుత్వం తరఫున రూ.25 లక్షల ఆర్థికసాయం ప్రకటించారని, అలాగే ఆయిల్ ఫ్యాక్టరీ నుంచి రూ.25 లక్షల చొప్పున నష్ట పరిహారం అందుతుందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో గిరిజనులు కూలిపనులకు వలసలు పోకుండా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.స్థానికంగానే ఉపాధి పనులు పెద్ద ఎత్తున కల్పించడమే కాకుండా స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలకు తక్షణ సాయం

- బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ
- వ్యక్తిగత ఆర్థిక సహాయం

కాకినాడ క్రైం: రోడ్లు భవనాల శాఖా మంత్రి దాడిశెట్టి రాజా శుక్రవారం ఉదయం జీ.రాగంపేట బాధిత కుటుంబాలను కాకినాడ జీజీహెచ్‌లో పరామర్శించారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని వారికి భరోసా ఇచ్చారు. వేదనలో ఉన్న కుటుంబీకులకు మంత్రి రాజా వ్యక్తిగత ఆర్థిక సాయం ప్రకటించారు. ప్రతి కుటుంబానికి రూ.50 వేల చొప్పున నగదు అందజేశారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి ప్రయోజనాలను తక్షణమే అందేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం నేరుగా మార్చురీకి వెళ్లి మృతదేహాలను పరిశీలించారు. మంత్రి వెంట రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఉన్నారు.

వసతికి ప్రత్యేక ఏర్పాట్లు

మృతదేహాలు గురువారం మధ్యాహ్నానికి కాకినాడ జీజీహెచ్ మార్చురీకి చేరగా వారి కుటుంబీకులు పాడేరు నుంచి రాత్రికి వచ్చారు. దీంతో వారి వసతి కోసం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జీజీహెచ్‌లోని ఓపీ ఎస్ఎస్ఆర్‌లో 30 మందికి ప్రత్యేక గదులు కేటాయించి వసతి భోజన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారి సమ్మతితో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. బాధిత కుటుంబాల వసతి ఏర్పాట్లపై చొరవ చూపిన డాక్టర్ హేమలతాదేవిని మంత్రి దాడిశెట్టి రాజా ఈ సందర్భంగా అభినందించారు.

ఊపిరాడకే దుర్మరణం

పాడేరుకు చెందిన ఐదు, పెద్దాపురానికి చెందిన రెండు, మొత్తం ఏడు మృతదేహాలకు జీజీహెచ్ ఫోరెన్సిక్ నిపుణులు శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. మృతుల జీర్ణకోశంతోపాటు శ్వాస నాళాల్లో చమురు అవశేషాలు గుర్తించారు. చమురు శ్వాస ఆడని స్థితిని కల్పించిందనీ తద్వారా ప్రాణాపాయానికి దారితీసిందని నిర్ధారించారు. మరణానికి ఊపిరాడకపోవడమే కారణమని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతదేహాల పోస్టుమార్టం, ప్రముఖుల పరామర్శల నేపథ్యంలో జీజీహెచ్‌లోని మార్చురీ ఆవరణలో పటిష్ఠ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



బాధిత కుటుంబసభ్యులను ఓదారుస్తున్న మంత్రి రాజా

అండగా 'నేను సైతం'

కొయ్యూరు: కాకినాడ జిల్లాలో ఆయిల్‌ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన గిరిజనుల కుటుంబాలకు నేనుసైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు కె.శివప్రసాద్ అండగా నిలిచారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకువచ్చేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి అంబులెన్సులు ఏర్పాటుచేశారు. వారి బంధువులు వచ్చేందుకు వాహనాలు సమకూర్చారు.

మిన్నంటిన ఆర్తనాదాలు

స్వగ్రామాలకు చేరిన మృతదేహాలు

పెదబయలు: ఆయిల్ ఫ్యాక్టరీ ప్రమాదంలో మృతి చెందిన ఐదుగురు గిరిజనుల మృతదేహాలు శుక్రవారం రాత్రి స్వగ్రామాలకు చేరడంతో కుటుంబసభ్యులు, బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి. పర్రెడ పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన వెచ్చంగి నర్సింగరావు(40), వెచ్చంగి కృష్ణారావు(36), వెచ్చంగి సాగర్(23), వంచేడిపుట్టుకు చెందిన కుర్తాడి బొంజుబాబు(35), బొండాపల్లి పంచాయతీ, చంపాపుట్టుకు చెందిన కొర్రా రామారావు(45) ఈ ప్రమాదంలో మృతిచెందారు. కాకినాడ జీజీహెచ్‌లో మృతదేహాలకు శుక్రవారం మధ్యాహ్నం శవపరీక్షలు పూర్తయిన అనంతరం మూడు అంబులెన్సుల్లో గ్రామాలకు తీసుకువచ్చారు. మృతదేహాలను చూసి కుటుంబసభ్యులు, బంధువులు గొల్లుమన్నారు. జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, పాడేరు సబ్‌కలెక్టర్ వి.అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాస్తవ, పోలీసులు, పెదబయలు తహసీల్దారు బాబూరావు గ్రామాలకు చేరుకున్నారు. బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



వివరాలు సేకరిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్



రోదిస్తున్న బాధిత కుటుంబాల సభ్యులు

51 జంటలకు వైఎస్సార్ కల్యాణమస్తు



నూతన వధూవరులకు కల్యాణమస్తు చెక్కును అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, సబ్ కలెక్టర్ అభిషేక్ తదితరులు

- రూ.51.50 లక్షల లబ్ధి
- చెక్కును అందజేసిన జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

సాక్షి,పాడేరు: వైఎస్సార్ కల్యాణమస్తు పథకంలో జిల్లాలో 51 జంటలకు లబ్ధి చేకూరింది. శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ మాట్లాడుతూ వైఎస్సార్ కల్యాణమస్తు పథకంలో జిల్లాలో 51 జంటలకు రూ.51.50 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీరిలో 49 మంది గిరిజన జంటలు, ఎస్సీ, బీసీ సామాజిక వర్గానికి చెందిన ఒక్కొక్క జంట ఉన్నాయన్నారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాన్ని వర్తింపజేశామన్నారు. సీఎం ప్రసంగం పూర్తయిన అనంతరం లబ్ధిదారులకు వైఎస్సార్ కల్యాణమస్తు మొత్తాన్ని చెక్కు రూపంలో జాయింట్ కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాడేరు సబ్‌కలెక్టర్ వి.అభిషేక్,అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ,డిఆర్‌డీఏ పీడీ మురళీ,డిఆర్‌వో అంబేద్కర్,గిరిజన సంక్షేమ డీడీ ఐ.కొండలరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వింటున్న అధికారులు, లబ్ధిదారులు

మంత్రి దృష్టికి గండిపోశమ్మ ఆలయ నిర్మాణం

దేవీపట్నం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురవుతున్న దేవీపట్నం మండలంలోని పూడిపల్లి పంచాయతీలోని గండిపోశమ్మ అమ్మవారి ఆలయం నూతన ఆలయ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ విషయాన్ని శుక్రవారం పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన జలవనరుల శాఖామంత్రి అంబటి రాంబాబు దృష్టికి తీసుకువెళ్లినట్టు ఆలయ ఈవో గండి లక్ష్మీకుమార్ తెలిపారు. ముంపునకు గురవుతున్న అమ్మవారి స్వయంభువును కర్ణాటక రాష్ట్రంలో కూడలి సంగమేశ్వర స్వామి గుడి తరహాలో రక్షణ చర్యలు చేపట్టనున్నారు.

ఈ విషయమై మంత్రి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి ఆలయ రక్షణకు అవసరమైన అంచనాలను వెంటనే రూపొందించాలని సంబంధిత ఇరిగేషన్ అధికారులను ఆదేశించినట్లు ఈవో తెలిపారు.



ఆలయ నిర్మాణ విషయమై ఇరిగేషన్ అధికారులతో మంత్రి అంబటి రాంబాబు

అనారోగ్యంతో వసతిగృహ విద్యార్థిని మృతి



ఈశ్వరీదేవి (ఫైల్)

దేవీపట్నం: మండలంలోని ముసుళ్లకుంట గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న కచ్చులూరుకు చెందిన విద్యార్థిని కానెం ఈశ్వరీదేవి అనారోగ్యంతో మృతిచెందింది. మూడు రోజులక్రితం జ్వరం రావడంతో ఇందుకూరుపేట పీహెచ్‌సీలో వైద్యం అందించారు. వైద్య పరీక్షల్లో టైఫాయిడ్‌గా నిర్ధారణ అయింది. గురువారం చికిత్స నిమిత్తం పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి కాకినాడ జీజీహెచ్‌కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందింది. వసతిగృహ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె మృతిచెందిందని విద్యార్థిని తల్లిదండ్రులు కానెం చిన్నారావు, సన్యాసమ్మ లు ఆరోపించారు. అనారోగ్యం విషయం వెంటనే తమకు తెలియజేస్తే మెరుగైన వైద్యం చేయించుకునే వాళ్లమని వారు ఆవేదన వ్యక్తంచేశారు. మృతిచెందిన బాలిక కుటుంబాన్ని ఎంపీపీ కుంజం మురళీ, వైఎస్సార్‌సీపీ నాయకులు, తహసీల్దార్ రామకృష్ణ, ఏటీడబ్ల్యూవో రామతులసి పరామర్శించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ప్రభుత్వ పరంగా న్యాయం చేసేందుకు కృషిచేస్తామని వారు హామీ ఇచ్చారు.

పెదబయలులో జీసీసీ విజిలెన్స్ తనిఖీలు

- రూ.10 లక్షల విలువైన కాలం చెల్లిన ఉత్పత్తుల గుర్తింపు
- రూ.20 లక్షల బకాయిలు చెల్లించకుంటే క్రమశిక్షణా చర్యలు
- హెచ్చరించిన రాష్ట్ర అధికారి వెంకటరమణ

పెదబయలు: స్థానిక జీసీసీ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర జీసీసీ విజిలెన్స్ అధికారి పి.వెంకటరమణ తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా రికార్డులను పరిశీలించారు. జీసీసీ గోదాములో కాలం చెల్లిన రూ.10 లక్షల విలువైన జీసీసీ ఉత్పత్తులను గుర్తించారు. వీటిని ఎందుకు విక్రయించలేదని జీసీసీ మేనేజర్, గోదాము ఇన్‌చార్జిని ప్రశ్నించారు. పెదబయలు బ్రాంచి పరిధిలో 2020–2021కుగాను రంగలోయ, పోయిపల్లి, లింగేటి, గుల్లేలు, లక్ష్మీపేట, పెదకోడాపల్లి డీఆర్ డిపోల పరిధిలో రూ.20 లక్షల బకాయి ఉందని, వీటిని నెల రోజుల్లో చెల్లించేలా సేల్స్‌మేన్ల నుంచి లిఖితపూర్వకంగా హామీ తీసుకున్నారు. గడువులోగా చెల్లించకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీ ఉత్పత్తుల కొనుగోళ్ళు, టర్నోవర్, డీఆర్ డిపోలకు సరఫరా చేస్తున్న సరకుల వివరాల రికార్డులను పరిశీలించారు. విక్రయాలకు సంబంధించి డబ్బులు చెల్లించిన వెంటనే అకౌంటెంట్ నుంచి రశీదు పొందాలని సేల్స్‌మెన్లను ఆదేశించారు. అనంతరం జీసీసీ పౌర సరఫరాలు, భారత్ గ్యాస్ గోదాంలను తనిఖీ చేశారు. అనంతరం జీసీసీ నిర్వహిస్తున్న బంకును పరిశీలించారు. ఆదాయ వివరాలను తనిఖీ చేశారు.మేనేజర్ గాసీ, గోదాము ఇన్‌చార్జీలు దీనాకుమారి, చంద్రశేఖర్‌రావు ,బంక్ ఇన్‌చార్జ్ కొండబాబు పాల్గొన్నారు.



పెదబయలు జీసీసీ గోదామును తనిఖీ చేస్తున్న రాష్ట్ర విజిలెన్స్ అధికారి వెంకటరమణ



పెట్రోల్ బంకులో ఆయిల్ నిల్వలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారి

గర్భిణికి అత్యవసర వైద్యం

- ప్రాణాపాయ స్థితిలో శస్త్రచికిత్స
- రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో తల్లీబిడ్డ ప్రాణాలు కాపాడిన వైద్యులు

రంపచోడవరం: పురిటి నొప్పులతో ప్రాణాపాయ పరిస్థితుల్లో వచ్చిన గర్భిణికి అత్యవసర వైద్యం అందించి స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్యులు ప్రాణాలు నిలిపారు. ఇంటివద్ద పురిటినొప్పులతో బాధపడుతున్న వై.రామవరం మండలం అంటలోవ గ్రామానికి చెందిన నైని లక్ష్మమ్మకు గర్భంలో బిడ్డ ప్రమాదకర పరిస్థితుల్లో ఉంది. ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడటంతో బంధువు సాయంతో కొండ మీద గ్రామం నుంచి గురువారం గుర్తేడు పీహెచ్‌సీకి చేరుకుంది. పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటనే అదేరోజు స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆస్పత్రిలో సివిల్ సర్జన్, గైనాకాలజిస్టు డాక్టర్.లక్ష్మి వెంటనే స్పందించారు. వెంటనే శస్త్రచికిత్స చేసి శిశువును బయటకు తీసి కాకినాడ ఎస్ఐసీయూకు పంపించారు. ప్రస్తుతం లక్ష్మమ్మ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, మరో 48 గంటలు పర్యవేక్షణ చేయాల్సి ఉందని డాక్టర్ లక్ష్మి తెలిపారు. అత్యవససర వైద్యం అందించడంలో మత్తు డాక్టర్ మూర్తి, సిబ్బంది బేబీలత, బాపనమ్మ సేవలందించారు.



ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మమ్మ

కారులో 84 కిలోల గంజాయి



పెదబయలులో.. కారు సీటు కవర్లో అమర్చిన గంజాయి ప్యాకెట్లు



అరకులో గంజాయితో పట్టుబడిన నిందితులు


కారు సీజ్, నలుగురికి రిమాండ్

పెదబయలు: మండలంలోని సీతగుంట పంచాయతీ ముసిడిపుట్టు గ్రామ సమీపంలో కారులో తరలిస్తున్న 84 కిలోల గంజాయిని పట్టుకున్నట్టు స్థానిక ఎస్‌ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ముసిడిపుట్టు గ్రామ సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా పెదబయలు నుంచి పాడేరు వెళ్తున్న కారు డిక్కీ, సీటు కవర్లలో ప్రత్యేకంగా అరలు ఏర్పాటు చేసి వాటిలో ప్యాక్ చేసిన గంజాయిని గుర్తించినట్టు తెలిపారు. గంజాయి ఒడిశా రాష్ట్రం బెజ్జింగిలో కొనుగోలు చేసి ముంచంగిపుట్టు మండలం ముక్కిపుట్టు మీదుగా పాడేరు తరలిస్తున్నారని పేర్కొన్నారు.

కారుతో పాటు కాకినాడ జిల్లాకు చెందిన ఎస్.రామకృష్ణ, అల్లూరి జిల్లా జి.మాడుగుల మండలానికి చెందిన లొంబోరి దాసుబాబును అదుపులో తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ వెల్లడించారు.

తరలిస్తూ మరో ఇద్దరు..

అరకులోయ రూరల్: గంజాయి తరలిస్తు ఇద్దరు నిందితులు పట్టుబడిన్నట్టు అరకులోయ ఎస్‌ఐ సంతోష్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం పాడువ నుంచి అరకులోయ మీదుగా ప్రయాణికుల ముసుగులో ఉన్న నల్గొండ జిల్లా మిరియాలగూడకు చెందిన రవీంద్రరెడ్డి, ఒడిశా చటువ గ్రామానికి చెందిన కొర్రా గోపాల్ అనే వ్యక్తులను యండపల్లివలస రైల్వే స్టేషన్ వద్ద అదుపులో తీసుకున్నామన్నారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.



నిరుద్యోగులకు టోకరా

- స్వచ్ఛభారత్ ఉద్యోగాల పేరిట మోసం
- రూ.లక్షల్లో వసూలు చేసి ముఖం చాటేస్తున్న మధ్యవర్తులు
- తాజాగా కొడుకు కొలువు కోసం రూ.1.7 లక్షలు చెల్లించి మోసపోయిన గిరిజన మహిళ

రాజవొమ్మంగి: మండలంలో ఎక్కడ చూసినా ఉద్యోగాల పేరిట మోసపోయిన యువత ఎక్కువగా కనుపిస్తున్నారు. స్వచ్ఛభారత్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో టోపీ వేస్తున్నారు. మండలంలోని లబ్బర్తి గ్రామంలోనే సుమారు 8 మంది ఇంటర్మీడియేట్ చదివి ఖాళీ ఉన్న నిరుద్యోగులు అదే గ్రామానికి చెందిన మధ్యవర్తులకు రూ.లక్షల్లో సొమ్ములు చెల్లించి లబోదిబోమంటున్నారు. తాజాగా ఇదే గ్రామానికి చెందిన గిరిజన మహిళ మిరియాల రమణమ్మ కూడా తన కుమారుడి ఉద్యోగం కోసం రూ.1.70 లక్షలు చెల్లించి మోసపోయింది. మధ్యవర్తికి సొమ్ములు చెల్లించి ఏడాదిన్నర కావస్తున్నా ఉద్యోగం రాలేదని, కనీసం సొమ్ములు మాకు ఇవ్వాలని కాళ్లువేళ్ల పడినా స్పందించడం లేదని కన్నీరు మున్నీరు అయ్యింది. వడ్డీపై అప్పు చేసి ఆ సొమ్ములు కట్టానని, నేడు అసలు వడ్డీ కట్టలేక నరకం అనుభవిస్తున్నారని రమణమ్మ విచారం వ్యక్తం చేసింది. సొమ్ములు తిరిగి అడిగితే ఆ వ్యక్తి ఒకసారి రూ.10వేలు, మరోసారి రూ.20వేలు ఇచ్చి ముఖం చాటేస్తున్నాడని వాపోయింది. ఈ విధంగా తమ పిల్లల ఉద్యోగం కోసం సొమ్ములు చెల్లించి ఉద్యోగం లేక, ఇచ్చిన సొమ్ములు తిరిగి చేతికి రాక దిక్కు తోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారని రమణమ్మ తెలిపింది. మండలంలో దాదాపు రెండేళ్లుగా స్వచ్ఛభారత్‌లో ఉగ్యోగాలు ఖాళీగా ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఈ ఉద్యోగాల్లో చేరితే ఇక తిరిగి వెనక్కు చూసుకోనక్కర్లేదని ప్రచారం జరగుతోంది. ఇది నమ్మి స్వచ్ఛభారత్ ఉద్యోగాల కోసం సొమ్ములు చెల్లించిన వారు మండలంలో లెక్కకు మించి అనేక మంది ఉండడం ఆందోళన కలిగిస్తున్న అంశం. ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి పేదలను మోసం చేసి సొమ్ములు వసూలు చేస్తున్న మధ్యవర్తులపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాల వారు కోరుతున్నారు.



కుమారుడి ఉద్యోగం కోసం సొమ్ములిచ్చినట్టు చెబుతున్న రమణమ్మ

నిరుద్యోగులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం



ఉద్యోగాలు ఇస్తామంటూ మండంలోని మోసాలు జరుగుతున్నాయి. రెండు, మూడు ఫిర్యాదులు కూడా మా దృష్టికి వచ్చాయి. ఎటువంటి ఆధారాలు, పత్రాలు లేకుండా ఇతరత్రా పక్కా డాక్కుమెంట్లు లేకుండా ఎవరికీ సొమ్ములు ఇవ్వద్దని నిరుద్యోగులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. మోసపోయిన వారి ఫిర్యాదు మేరకు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి సొమ్ము వసూలు చేసి అందేలే చర్యలు తీసుకుంటాం.

– గోపి నరేంద్ర ప్రసాద్, ఎస్ఐ, రాజవొమ్మంగి

రాజ్‌కుమార్‌ను కోర్టులో హాజరుపరచాలి

ఏఎస్సార్ డివిజన్ కమిటీ పేరుతో లేఖ

ఎటపాక: అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక పోలీసులు అదుపులోకి తీసుకున్న మావోయిస్టు పార్టీ సభ్యుడు రాజ్‌కుమార్‌ను వెంటనే కోర్టులో హాజరు పరచాలని కొత్తగూడెం –అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో కోరింది. మావోయిస్టు పార్టీ కార్యకలాపాల్లో భాగంగా వెంకటాపురం గ్రామానికి వెళ్లగా, గురువారం రాత్రి ఎటపాక పోలీసులు అరెస్టు చేసిన రాజ్‌కుమార్‌తో పాటు మరికొందరు గ్రామస్తులను తక్షణమే కోర్టులో హాజరుపర్చాలని లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక విలేకరులకు ఆజాద్ పేరుతో లేఖలు అందాయి.

కల్యాణపు లోవలో ఘనంగా విగ్రహాల ప్రతిష్టాపన



ప్రతిష్టాపన కార్యక్రమంలో భక్తులు

రావికమతం: కల్యాణపు లోవలో కల్యాణ పోతు రాజుబాబు ఆలయం (శివాలయం) వద్ద మహా శివ లింగంతోపాటు విఘ్నేశ్వర, నందీశ్వరుడు, చండీశ్వరుడు, దేవతా విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. దేవదాయ శాఖ, ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో రుత్విక్‌లు ఈ క్రతువు నిర్వహించారు. హోమాది కార్యక్రమాలు చేపట్టారు. విగ్రహాల ప్రతిష్టాపనతోపాటు ఆలయంలో టైల్స్ వేసి అందంగా తయారు చేయడంతో కొత్తరూపు దిద్దుకుంది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ పైల రాజు, ఆలయ చైర్మన్ పాడి పోతురాజు, సర్పంచ్ వంజరి గంగరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, సచివాలయ మండల కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, ఈవో మురళీ కృష్ణ, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో ఉత్సవ ఏర్పాట్లు

హుకుంపేట: ప్రముఖ పుణ్యక్షేత్రం, ఆధ్యాత్మిక కేంద్రమైన మత్స్యగుండంలో ఈ నెల 17,18,19 తేదీల్లో జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ అభిషేక్ ఆదేశించారు. శుక్రవారం ఆయన మత్స్యగుండంలో ఏర్పాట్లను పరిశీలించారు. మత్స్యలింగేశ్వర స్వామి ఆలయం నుంచి మత్స్యదేవతలున్న ప్రదేశానికి వెళ్లే మార్గాన్ని, పారిశుధ్యం పనులను పరిశీలించారు. వాహనా పార్కింగ్ స్థల వివరాలను ఉత్సవ కమిటీ నుంచి తెలుసుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మఠం సింహాచలంనాయుడు,కార్యదర్శి పాంగి మత్స్యకొండబాబు, సభ్యులు బాలయ్య,హరనాథ్ పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్

ఐటీఐలో నేషనల్ అప్రెంటిస్ షిప్ మేళా

కంచరపాలెం: పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ) లో వివిధ కోర్సులు పూర్తి చేసి అప్రెంటిస్ పూర్తి కాని అభ్యర్థుల కోసం ప్రభుత్వ ఐటీఐ నరవ (కంచరపాలెం పాత ఐటీఐ ప్రాంగణం)లో ఈ నెల 13 సోమవారం ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్ షిప్ మేళా–2023 నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ నరవ ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మి తెలిపారు. ప్రముఖ 20 జాతీయ స్థాయి కంపెనీల ప్రతినిధులు అప్రెంటిస్ షిప్ మేళాలో పాల్గొంటారని, అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు. ఐటీఐల్లో అన్ని ట్రేడులు పూర్తి చేసిన అభ్యర్థులు అప్రెంటిస్ మేళాలో పాల్గొనాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు 13వ తేదీ ఉదయం 10 గంటలకు నేరుగా ప్రభుత్వ ఐటీఐ నందు బయోడేటా, ధ్రువ పత్రాలతో హాజరు కావాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు 9398785720 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరానికి తరలివచ్చిన గిరిజనులు

- 2100 మందికి వైద్య పరీక్షలు

డుంబ్రిగుడ: మండలంలోని అరకు వారపు సంతలో పశుసంవర్ధక శాఖ ఏడీ అశ్వత్థామ ఆర్థిక సాయంతో, వైఎస్సార్‌సీపీ సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి, హుకుంపేట మండలాల నుంచి పెద్ద సంఖ్యలో వ్యాధిగ్రస్తులు తరలివచ్చారు. శిబిరంలో థైరాయిడ్, బీపీ, సుగర్, రక్తహీనత, చర్మవ్యాధులు తదితర వ్యాధులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరానికి ఆయా మండలాల నుంచి సుమారు 2100 మందికి పైగా గిరిజనులు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నట్టు అశ్వత్థామ తెలిపారు. ఇందులో భాగంగా నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 246 మంది పరీక్షలు చేయించుకున్నారని, వీరిలో 16 మందికి కళ్లద్దాలు అందజేశామని, పలువురికి శస్త్ర చికిత్సను ఉచితంగా చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిత్యం ఉచిత వైద్యం అందించేందేందుకు చర్యలు తీసుకుంటామని అశ్వత్థామ చెప్పారు. విజయనగరం నిమ్స్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సేవలందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నరావు, భాస్కర్‌రావు, రాంనాయుడు పాల్గొన్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

నాతవరం: స్థానిక పోలీసు స్టేషన్‌ను ఎస్పీ గౌతమిసాలి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. దీంతో అక్కడ సిబ్బంది ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ రికార్డులను ఆమె పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్ పరిసరాలను సైతం పరిశీలించి వెనుతిరిగారు.

శారదా పీఠానికి వేద గాయత్రీదేవి ఆలయం దత్తత




స్వరూపానందేంద్ర సరస్వతికి పత్రాలు అందిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సింహాచలం : జీవీఎంసీ 94వ వార్డు పరిధి నాయుడుతోటలో ఉన్న వేద గాయత్రి దేవి ఆలయాన్ని విశాఖ శ్రీ శారదా పీఠానికి ఆలయ కమిటీ దత్తత ఇచ్చింది. ఈ మేరకు శారదా పీఠంలో స్వరూపానందేంద్ర సరస్వతిని ఆలయ కమిటీ ధర్మకర్త రాపర్తి కన్నా, గాయత్రి బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు పీఠంలో శుక్రవారం కలిసి సంబంధిత పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ధర్మకర్త రాపర్తి కన్నా మాట్లాడుతూ వేదమాత గాయత్రి దేవి ఆలయాన్ని కమిటీ అభ్యర్థన మేరకు విశాఖ శ్రీ శారదాపీఠంలో కలపాలని ఏకగ్రీవంగా తీర్మానించామన్నారు. ఈ మేరకు స్వామీజీని కలిసి పత్రాలు అందించామన్నారు. కార్యక్రమంలో గాయత్రి బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కూర్మారావు, కార్యదర్శి శర్మ, ప్రతినిధులు వాసు మాస్టారు, మంగు శేషగిరి రావు, కృష్ణమూర్తి మాస్టారు, ఆకెళ్ల బాబి, సుబ్బరామన్, జి.రామారావు, ప్రకాష్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

ఆరుగురికి గాయాలు, ఆస్పత్రికి తరలింపు





సంఘటనా స్థలాల్లో మృతదేహాలు

ఎటపాక: ఎటపాక మండలం బండిరేవు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు.. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం కుంట ప్రాంతానికి చెందిన మడివి రాము, రాంబాబులు ద్విచక్ర వాహనంపై భద్రాచలం నుంచి కుంట వెళ్తున్నారు. విస్సాపురం గ్రామ పంచాయతీ పరిధి చిమిలి వాగు వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న చెట్టును ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. దీంతో రాము(30) అక్కడికక్కడే మృతిచెందగా, రాంబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతన్ని భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. రెండో రోడ్డు ప్రమాదం బండిరేవు సమీపంలో జరిగింది. ఈ ప్రమాదంలో ఒకరు మరణించగా ఆరుగురికి గాయాలయ్యాయి. చింతూరు మండలంలోని ఏడుగురాళ్లపల్లిలో సంత ముగించుకుని ఆటోలో ఆరుగురు లక్ష్మీపురం బయలుదేరారు. భద్రాచలం నుంచి చింతూరు వెళ్తున్న ఓ మినీ వ్యాన్ కట్టలు విరిగిపోవడంతో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న వంగోటి బ్రహ్మచారి(51) అక్కడికక్కడే మరణించగా మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ రెండు ప్రమాదాలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

చెరకు సాగులో ఆధునిక సాంకేతికత



చెరకు రైతులకు ఆధునిక వంగడాలను అందజేస్తున్న ఏడీఆర్ జగన్నాథరావు

అనకాపల్లి టౌన్: ఆధునిక పద్ధతులను ఉపయోగించి చెరకు సాగు చేస్తే రైతులకు పూర్వ వైభవం వస్తుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ పి.వి.కె.జగన్నాథరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా టీ అండ్ వి (శాస్త్రవేత్తలు) సమావేశంలో ఆయన మాట్లాడారు. అపరాలలో బూడిద తెగుళ్లు, మొజాయిక్ తెగుళ్లు, నివారణ చర్యలను ఆయన వివరించారు. అనకాపల్లి జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు మాట్లాడుతూ రబీ సీజన్‌లో అపరాలు, వేరుశనగ, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, నువ్వుల పంటల సాగు రైతులకు లాభసాటిగా ఉంటుందని పేర్కొన్నారు. విశాఖ జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి మాట్లాడారు. అనంతరం చెరకు రైతులకు ఆధునిక వంగడాలను అందజేశారు. ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు చిత్కళాదేవి, కె.వి.రమణమూర్తి, ఆదిలక్ష్మి, విశాలాక్షి, భవాని, శరిత, శ్రీదేవి, టి అండ్ వి మీటింగ్ సమన్వయ కర్త డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై అధ్యయనం

- ఐవోసీఎల్ పరిశోధన విభాగం డైరెక్టర్ రామ్ కుమార్



డాక్టర్ రామ్ కుమార్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి తదితరులు

ఏయూ క్యాంపస్: ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై అధ్యయనం చేయాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రామ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన ఏయూను సందర్శించి వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాద రెడ్డితో భేటీ అయ్యారు. ఏయూ పూర్వ విద్యార్థి అయిన రామ్ కుమార్‌ను వర్సిటీ తరపున వీసీ ప్రసాద రెడ్డి సత్కరించారు. అనంతరం పాలకమండలి సమావేశ మందిరంలో ఏయూ అధికారులు, ఆచార్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్ కుమార్ మాట్లాడుతూ ఇంధన రంగానికి ఉపయుక్తంగా నిలిచేలా ఏయూ నుంచి విశిష్ట ఆలోచనలతో పరిశోధనలను తాము ప్రోత్సహిస్తామన్నారు.

గత ఐదు దశాబ్దాలుగా ఐవోసీఎల్‌కు చెందిన ప్రత్యేక రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెంటర్ చేపడుతున్న పరిశోధనలు, ఆవిష్కరణలు, పేటెంట్లను వివరించారు. త్వరలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రీసెర్చ్ సెంటర్‌లో పరిశోధనలపై వివరించారు. నెట్, గేట్ అర్హత సాధించిన పరిశోధకులకు తమతో కలిసి పనిచేసే అవకాశం కల్పిస్తామన్నారు. బయోమాస్ నుంచి గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, పెట్రో కెమికల్స్ – పాలిమర్స్, బయోటెక్నాలజీ, నానో టెక్నాలజీ రంగాల్లో సంయుక్తంగా పనిచేయడానికి అనుకూలంగా ఉన్న అంశాలను వివరించారు. ఏయూ విద్యార్థులు, పరిశోధకులు నూతన ఆలోచనలతో వస్తే తాము నిర్వహించే స్టార్టప్ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి మాట్లాడుతూ నూతన ఆలోచనలతో సమస్యలకు పరిష్కారాలు చూపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఐవోసీఎల్‌తో తమ భాగస్వామ్యం మరింత బలోపేతం చేస్తామన్నారు. రెక్టార్ ఆచార్య కె.సమత, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎ.కిషోర్ బాబు, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐపీఆర్ చెయిర్ డాక్టర్ హెచ్.పురుషోత్తం, ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో రవి ఈశ్వరపు పాల్గొన్నారు.